క్లుప్తంగా

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



బీబీపేట: రాష్ట్రంలోని పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుతారి రమేష్ అన్నారు. ఆదివారం ప్రభుత్వం అందిస్తున్న కొత్త రేషన్ కార్డులను మల్కాపూర్‌లో లబ్ధిదారులకు ఆయన అందజేశారు. రేషన్ కార్డులు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ నాయకులు భూమాగౌడ్, చిలుక భాస్కర్, నర్సింహారెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ కుటుంబానికి పరామర్శ



రాజంపేట: రాజంపేట మాజీ ఎంపీటీసీ గుర్రాల రవి కుటుంబాన్ని ఆదివారం కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పరామర్శించారు. ఐదు రోజుల క్రితం మాజీ ఎంపీటీసీ గుర్రాల రవి తండ్రి గుర్రాల పెద్ద బాలయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలిసిన గంప గోవర్ధన్.. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

లింగంపేటలో..మాజీ ఎమ్మెల్యే జాజాల



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పరామర్శించారు. పర్మళ్ల గ్రామానికి చెందిన చాకలి ఆశయ్య తల్లి మృతి చెందడంతో వారిని ఓదార్చారు. భవానిపేటకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సాయికుమార్ ప్రమాదంలో గాయపడి కాలు విరగడంతో ఆయనను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

రేపు మందకృష్ణ మాదిగ రాక



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఈ నెల 5న లక్ష్మీదేవి గార్డెన్(దేవునిపల్లి రోడ్)లో జరిగే దివ్యాంగుల సదస్సుకు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఈ సదస్సుకు జిల్లాలోని దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, బీడీ, చేనేత కార్మికులు హాజరుకావాలని కోరారు.

పోరాటాలకు సిద్ధం కావాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): రాజకీయ పార్టీలకతీతంగా రైతు సంఘం నిర్మాణం కావాలని, సమస్యల సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం బాణాపూర్‌లో సంఘం మొదటి జిల్లా మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిగా రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. కొత్త రైతు చట్టాలను తెచ్చి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు ధారాదత్తం చేసిందని ఆరోపించారు. ఆదాని, అంబానీలకు వ్యవసాయ రంగాన్ని అప్పగించిందని విమర్శించారు. రాష్ట్ర నాయకులు పరమేశ్వర్, దేవారం, రామకృష్ణ, ప్రకాష్, కిషోర్, సురేష్,అంబన్న,కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

'రక్షాబంధన్ భారతీయ సంస్కృతి గొప్పతనం'



కామారెడ్డి అర్బన్: చాతుర్మాస్య ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక సిరిసిల్ల రోడ్డులోని జైన సంఘ భవనంలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ములకు రాఖీ కట్టడం అంటే వెనుక ఎంతో ఆపాయ్యత, అనురాగం, బంధం ఉంటుందని ఒకరికొకరు రక్షణగా ఉంటామని ప్రతిజ్ఞ చేస్తూ చేతికి రాఖీలు కట్టడం, కానుకలు, కట్నాలు స్వీకరించడం, ఆశీర్వాదాలు ఇవ్వడం భారతీయ సంస్కృతి గొప్పతనమని జైన గురువులు సంస్కార్ సిద్ధార్థ మునీజీ, సౌమ్యాజీ, రిద్ధిశ్రీ, లలిత్ ప్రభు, శాంతి ప్రియాజీలు అన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తమ అక్కచెల్లెళ్లలతో రాఖీలు కట్టించుకున్నారు. జైన సంఘం అధ్యక్షుడు కమల్‌చంద్ జైన్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

- ఊరికి దూరంగా మైదానాలు
- ఆటలకు దూరమవుతున్న గ్రామీణ యువత



సదాశివనగర్ క్రీడాప్రాంగణంలో మొలిచిన పిచ్చి మొక్కలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): గ్రామీణ ప్రాంత యువతను శారీరకంగా, ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఒక క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయనే విషయం అందరికి తెలుసు. గ్రామీణ ప్రాంత యువతలో క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు, నిత్యం క్రీడలు సాధన చేసేందుకు ప్రభుత్వం గతంలో క్రీడా ప్రాంగణాలకు శ్రీకారం చుట్టింది. మండలంలో ఒక రెండు మూడు చోట్ల మాత్రమే క్రీడా ప్రాంగణాలు వినియోగించుకుంటున్నప్పటికి మిగతా గ్రామాల్లో ఊరికి దూరంగా ఏర్పాటు చేయడంతో నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ప్రాంగణాలు వినియోగంలోకి వచ్చేలా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

మండలంలోని గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన ఈ ప్రాంగణాల నిర్మాణం కోసం ఒక్కో దానికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు నిధులు కేటాయించారు. వాటిలో బోర్డుతో పాటు వ్యాయామం కోసం సింగిల్ బార్, డబుల్ బార్, ఆట స్థలం, ఎక్కువగా ఉన్న చోట వాలీబాల్ కోర్టులను ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో పాఠశాల ప్రాంగణాల్లో ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల కేవలం బోర్డులు పెట్టి చేతులు దులుపుకున్నారు.

అనువైన స్థలాలు లేకపోవడంతో..

మండలంలోని పలు గ్రామాల్లో ఊరికి దూరంగా ప్రాంగణాలను ఏర్పాటు చేయడం, అనువైన స్థలం లేకపోవడంతో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. ఎత్తు పల్లాలు ఉన్నచోట కొద్ది స్థలంలో ప్రాంగణాలు ఏర్పాటు చేయడం వల్ల క్రీడాకారులు అక్కడికి వెళ్లడం లేదు.

దీంతో ప్రాంగణాలు పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల ఆట పరికరాలు లేకపోవడం సమస్యగా మారింది.

వినియోగంలోకి తీసుకురావాలి



ప్రభుత్వ నిధులతో నిర్మించిన క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలి. అధికారులు పట్టించుకోవాలి. రూ.లక్షలు పెట్టి ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి వినియోగంలోకి తేవాలి.

–పోసాని శ్రీనివాస్, సదాశివనగర్

చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను పరిశీలిస్తాం. వినియోగంలోకి వచ్చేలా దృష్టి సారిస్తాం. ప్రాంగణాల్లో ఏవైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరిస్తాం. యువత క్రీడా ప్రాంగణాలను సద్వినియోగం చేసుకునే విధంగా దృష్టి పెడతాం.

–సంతోష్‌కుమార్, ఎంపీడీవో, సదాశివనగర్

పిల్లర్లకే పరిమితమైన అదనపు గదులు



నిర్మాణంలో ఉన్న మొగులాన్‌పల్లి తండా పాఠశాల

బాన్సువాడ రూరల్: మొగులాన్‌పల్లి తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అదనపు గది రెండేళ్లుగా పిల్లర్లకే పరిమితమైంది. అధికారులు పట్టించుకోకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. ఇదే స్థలంలో ఉన్న తరగతి గది శిథిలావస్థకు చేరిందని, దాన్ని తొలగించి నూతనంగా అదనపు గది నిర్మాణ పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభించి రెండేళ్లు పూర్తయినా నేటికీ అదనపు గది నిర్మాణం పూర్తికాలేదు. దీంతో 5 తరగతులు ఉన్న ఈ పాఠశాలలో అన్ని తరగతులు ఒకే గదిలో నిర్వహించాల్సి వస్తోంది. బోర్లం హరిజనవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనూ అదనపు గది పనులు ప్రారంభించిన 2 నెలలకే పిల్లర్ల స్థాయిలో నిలిచిపోయాయి. కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు పూర్తిచేయించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ప్రతినిధి మఠం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మత్తు పదార్థాలు సేవించడం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. హెడ్ కానిస్టేబుల్ వడ్ల సత్యం చారి, కానిస్టేబుల్ ప్రభు, ఫారూఖ్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

'జనం కోసం జనహిత పాదయాత్ర'



పాదయాత్రలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రజల వద్దకు ప్రజాపాలన చేపట్టగా జనం కోసం కాంగ్రెస్ పార్టీ జనహిత పాదయాత్ర చేపడుతోందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. ఆదివారం ఆర్మూర్ నియోజకవర్గంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ జనహిత పాదయాత్రలో ఎమ్మెల్యేతో పాటు నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాక్షితో మాట్లాడారు. ప్రజల వద్దకు పాలనతో పాటు ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు పార్టీ అధిష్ఠానం పాదయాత్ర చేపట్టిందని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు ఏలే మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, సాయిపటేల్, ఎస్‌ఆర్‌ఐ భాస్కర్‌రెడ్డి, రమేష్ యాదవ్ తదితరులున్నారు.

ప్రారంభోత్సవం ఎప్పుడు?



మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని చిన్న టాక్లీలో నూతనంగా నిర్మించిన జీపీ భవనాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారు సారు అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. మూడేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం సొంత భవనాలు లేని జీపీలకు నిధులు మంజూరు చేసింది. ఒక్కో పంచాయతీకి రూ.20 లక్షల చొప్పున ఉపాధి నిధులు మంజూరయ్యాయి. చిన్న టాక్లీలో నూతన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉన్నా ప్రారంభించడం లేదని, రెండు నెలల క్రితమే పనులు పూర్తయినా ఎందుకు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. త్వరగా ప్రారంభించి కార్యకలాపాలు మొదలుపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరు క్రీడలపై ఆసక్తి కనబర్చాలి

బీబీపేట: ప్రతి ఒక్కరు క్రీడలపై ఆసక్తి కనబర్చాలని ఎస్సై ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో క్రీడా భారతి ఆధ్వర్యంలో అండర్–19 వాలీబాల్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. డాక్టర్ తంగళ్లపల్లి సంతోష్ గౌడ్, నిర్వాహకులు ఎల్లమైన హరీష్, దిటి బాలకృష్ణ, గుర్రాల నవీన్, పోసు శివకుమార్, మామిడాల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహం పెరుగుతుంది

భిక్కనూరు: క్రీడలతో స్నేహభావం పెరుగుతుందని బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం భిక్కనూరు మండల కేంద్రంలో క్రీడాభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–19 వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. క్రీడాభారతి మండల కన్వీనర్ మోహన్ రెడ్డి ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు పురాంరాజమౌళి, రామదండు ప్రతినిధులు గొల్ల రమేశ్‌యాదవ్, తమ్మలి సాయికుమార్, సింగం శ్రీనివాస్, గంగారాం, ఎస్సై నరేందర్‌లు పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట: క్రీడాభారతి ఆధ్వర్యంలో రాజంపేట మండల కేంద్రంలో ఆదివారం అండర్–19 విభాగంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ముఖ్య అతిథులుగా జిల్లా కార్యవాహక సభ్యులు అనిల్ రెడ్డి, పిట్ల శ్రీను, రాము పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో ఎంతో ఉపయోగం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): కల్లు దుకాణాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల ఎంతో ఉపయోగం ఉందని ఎస్సై మురళి అన్నారు. తాడ్వాయి కల్లు డిపోలో ఆదివారం సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గౌడ సంఘం సభ్యులందరూ కలసి డబ్బులను ప్రోగు చేసి 8 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్క కుటుంబం తమ ఇంటి వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గౌడ సంఘం సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, సాయిరాంగౌడ్, బాలాగౌడ్, రమేష్ గౌడ్, రామాగౌడ్, శంకర్‌గౌడ్, సంగాగౌడ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో ఇబ్బందులు



కొత్తాబాది సమీపంలో రోడ్డుపై లేస్తున్న దుమ్ము

బాన్సువాడ రూరల్: జాతీయ రహదారి ఏర్పాటు పనుల్లో భాగంగా గత ఏడాది కాలంగా బాన్సువాడ–ఎల్లారెడ్డి ప్రధాన రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. కల్వర్టులు, స్లిప్‌వే ఉన్న పలు చోట్ల బీటీ రోడ్డు అసంపూర్తిగా మిగిలి ఉంది. నెలల తరబడి కంకర, సిమెంట్ మిక్స్‌పౌడర్ వేసి బీటీ వేయకపోవడంతో భారీ వాహనాలు వెళ్తున్నప్పుడు విపరీతంగా వస్తున్న దుమ్ము ధూళితో వాహనదారులకు ఇబ్బంది కలుగుతోంది. రోడ్లపై వాటర్ క్యూరింగ్ చేయకపోవడంతో దుమ్ము వస్తోంది. స్థానికుల ఇళ్లలోకి దుమ్ము చేరుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులు పూర్తయ్యే వరకు రోడ్డుపై వాటర్ క్యూరింగ్ చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి చిత్రం



రెడ్డిపేటలో రోడ్డుపై వేచి ఉన్న ప్రయాణికులు

బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలి

రామారెడ్డి: మండలంలోని రెడ్డిపేటలో ప్రయాణికుల వసతి కోసం బస్సు షెల్టర్ నిర్మించాలి. ప్రయాణికులు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఇబ్బంది పడుతున్నారు. కనీసం చిన్న షెడ్డునైనా నిర్మిస్తే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుంది. అధికారులు స్పందించాలి.

–గర్గుల్ రాజాగౌడ్, రెడ్డిపేట్

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200
ఎల్లారెడ్డి : 97053 46576
బాన్సువాడ : 94402 11363
జుక్కల్ : 97053 46578

పొంచి ఉన్న ప్రమాదం..!



తాడ్కోల్ శివాజీ చౌరస్తాలో కల్వర్టుపై గుంతలు



పద్మాజీవాడి చౌరస్తా వద్ద కోతకు గురైన సర్వీస్ రోడ్డు

బాన్సువాడ రూరల్: తాడ్కోల్ గ్రామం బాన్సువాడ– బిచ్కుంద రహదారిపై శివాజీ విగ్రహం ఎదుట రోడ్డు అత్యంత ప్రమాదకరంగా మారింది. నిజాంసాగర్ ప్రధాన కాలువకు అనుబంధంగా ఉన్న 10 నెంబర్ ఉప కాలువ కల్వర్టుపై ఈ రోడ్డు ఉంది. కల్వర్టుపై 3 చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. రోజురోజుకు గుంతల పరిమాణం పెరుగుతోంది. ఈ రోడ్డు గుండా నిత్యం వందలాది భారీ వాహనాలు వెళ్తుంటాయి. కొత్త వ్యక్తులు ఈ రోడ్డు గుండా వేగంగా ప్రయాణిస్తున్న సమయంలో ఆదమరిచి వాహనం గుంతలో పడితే ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి పాత కల్వర్టును తొలగించి కొత్తది నిర్మించాల్సిన అవసరం ఉంది. అప్పటి వరకు హెచ్చరిక బోర్డులు పెట్టి ట్రాఫిక్‌ను మళ్లించాలని స్థానికులు కోరుతున్నారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజీవాడి చౌరస్తా వద్ద సర్వీస్ రోడ్లకు ఇరు వైపులా కోతకు గురికావడంతో ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి గుండా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అధికారులు మాత్రం దృష్టి సారించడం లేదు. వాహనాలు అదుపు తప్పి గుంతలో పడితే భారీ ప్రమాదాలు జరుగుతాయి. ఇప్పటికైనా నేషనల్ హైవే అథారిటీ అధికారులు దృష్టి సారించి మట్టితో పూడ్చి వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

బతుకుబాట



బాన్సువాడ -బోధన్ రహదారి పక్కన మక్కలు అమ్ముతున్న ఇస్లాంపూరవాసులు

బాన్సువాడ: ఒకప్పుడు రోడ్లపై అడుక్కుంటూ, కూలీ పని చేస్తూ జీవనం సాగించే కొంతమంది ఇస్లాంపూర, రాజారాందుబ్బావాసులు ప్రస్తుతం బతుకుబాట పట్టారు. బాన్సువాడ–బోధన్ రహదారి పక్కన నాలుగు కట్టెలు పాతి ప్లాస్టిక్ కవర్ వేసుకుని వరుసగా కూర్చొని మక్కలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఒక పెద్ద బొగానిలో మినరల్ వాటర్ పోసి అందులో మక్కలను ఉడకబెడతారు. ఉడకబెట్టిన మక్కలను విక్రయిస్తూ ఖర్చులు పోను ఒక్కొక్కరు ప్రతి రోజూ రూ.500 నుంచి రూ.800 వరకు సంపాదిస్తూ కుటుంబాలను పోషిస్తున్నారు.

కుర్మ కులస్తులు అన్ని రంగాలలో రాణించాలి



మాట్లాడుతున్న సంఘం నేత భూమన్న

ఎల్లారెడ్డిరూరల్: కుర్మ కులస్తులు అన్ని రంగాలలో రాణించాలని కుర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు భూమన్న అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డి పట్టణంలోని బాలాగౌడ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కుర్మ సంఘం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుర్మలు కులవృత్తితో పాటు రాజకీయంగా అన్ని రంగాలలో రాణించాలని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతి గ్రామంలో సర్పంచులుగా పోటీ చేసి గెలుపొందాలని అన్నారు. వీటితో పాటు మండల, జిల్లా స్థాయి పదవులకు పోటీ పడాలన్నారు. ఉపాధ్యక్షులు చంద్రన్న, బుచ్చన్న, పద్మారావు, చిరంజీవులు ఉన్నారు.

గ్రంథాలయ వేళల మార్పుపై నిరుద్యోగుల నిరసన



ఎల్లారెడ్డిలో నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు

ఎల్లారెడ్డి: స్థానిక గ్రంథాలయ వేళల మార్పుపై నిరుద్యోగులు ఆదివారం గ్రంథాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. గ్రంథాలయం పని వేళలు గతంలో ఉదయం 8 నుంచి 11 వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు ఉండేదని, ప్రస్తుతం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మార్చడంతో చిన్నచిన్న పనులు చేసుకునే వారికి సౌకర్యంగా లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాత పని వేళలను కొనసాగించాలని వారు కోరారు.

సంక్షిప్తం

సహకార బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ రక్తదానం

కామారెడ్డి అర్బన్: కేంద్ర సహకార బ్యాంకు ఎల్లారెడ్డి శాఖ అసిస్టెంట్ మేనేజర్ ఎల్.సాయిప్రణీత్‌గౌడ్ ఆదివారం బి–పాజిటివ్ రక్తాన్ని దానం చేశారు. కామారెడ్డికి చెందిన ఒకరికి అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో కామారెడ్డి రక్తదాతల సమూహం ద్వారా సాయిప్రణీత్‌గౌడ్ రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ సమన్వయకర్త బాలు అభినందించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ల మండల కమిటీ ఎన్నిక



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా దేవిసింగ్, ఉపాధ్యక్షుడిగా మార బాల్‌రెడ్డి, కార్యదర్శిగా పొన్న నర్సింలు,కోశాధికారిగా కొండ రాజశేఖర్,సలహాదారులుగా పుష్పాంజలిలను ఎన్నుకున్నారు.ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు జిల్లాల నాగరాజు, మాజీ మండలాధ్యక్షుడు రఘునాథ్ రావు పాల్గొన్నారు.

పింఛనుదారులంతా తరలి రావాలి

రామారెడ్డి: కామారెడ్డి లక్ష్మీదేవిగార్డెన్స్‌లో ఈ నెల 5న వికలాంగుల చేయూత పెన్షన్‌దారుల సన్నాహక సభను నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంథని సామ్యేల్ మాదిగ అన్నారు. ఆదివారం ఆయన రామారెడ్డిలో మాట్లాడారు. ఈసభకు ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. పెన్షన్‌దారులకు అండగా నిలబడి ప్రభుత్వ మోసాన్ని ఎండగడతామన్నారు. నాయకులు కొత్తోళ్ల యాదగిరి, శేఖర్, కర్రెం బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి

బాన్సువాడ:ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్ప నిసరని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. ఆదివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేసిన ప్రధానోపాధ్యాయులు సాయిలు పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులను తీర్చిదిద్ది ఉన్నత స్థాయికి వెళ్లేలా ప్రోత్సహించడం ఉపాధ్యాయులకే సాధ్యమవుతుందని అన్నారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు నరహరి, శ్రీనివాస్ ఉన్నారు.

సోయాబీన్‌లో పచ్చపురుగు బెడద

మద్నూర్(జుక్కల్): మద్నూర్ పరిధిలో సోయాబీన్ పంటలో పచ్చ పురుగు పెరిగిపోయింది. దీంతో రైతులు పంటలకు మందులు పిచికారి చేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం సోయా పంట ఎదుగుదల బాగుందని, పంటకు తెగుళ్లు ఆశించాయని, పంట కాపాడుకునే ప్రయత్నంలో ఉన్నామని రైతులు చెప్పారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో ఆదివారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. 2వ వార్డులో సీసీ రోడ్డు లేక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు విన్నవించడంతో ఎమ్మెల్యే సూచన మేరకు సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్లు పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్ తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులు సాయిబాబా, విద్యాసాగర్, మల్లేష్ తదితరులున్నారు.